సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 10 । మార్చి । 2024



కాశీవిశ్వనాథుడి కల్యాణం

కడ్తాల్ మండలం పరిధిలోని మైసిగండి గ్రామంలోని కొలువైన కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. 8లో ▸



మానవత్వం చాటి..

మతిస్థిమితం లేని యువకుడిని స్థానికులు చేరదీశారు. క్షవరం, స్నానం చేయించి కొత్తబట్టలిచ్చి భోజనం పెట్టించారు. 8లో ▸



నిందితుడికి రిమాండ్

గొడవపడి కర్రతో తలపై కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో చోటు చేసుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

సమన్వయంతో పనిచేస్తే గెలుపు మనదే

చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే గెలుపు సులభమని చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని మణి గార్డెన్‌లో శనివారం పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. కరోనా మహమ్మారి నుంచి భారత దేశాన్ని కాపాడిన గొప్ప నాయకుడు ప్రధాని మోదీ అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది తెలంగాణ కోసం, రంగారెడ్డి జిల్లా కోసమని స్పష్టం చేశారు. దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ అబ్ కి బాత్ రాహుల్ సర్కార్ అనాలని సవాల్ విసిరారు.ఎంపీ స్థానాల్లో గెలిస్తే భవిష్యత్తు మొత్తం మనదే అని, స్థానిక సంస్థల్లోనూ బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్,అసెంబ్లీ ప్రభారి రాజవర్ధన్,స్టేట్ కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నారీ శక్తి ఫిట్‌నెస్ రన్



మహిళలకు పరుగు పందెం నిర్వహిస్తున్న అధికారులు

కందుకూరు: మండల పరిధిలోని గూడూరు చౌరస్తా వద్ద ఉన్న తెలంగాణ మహిళా గురుకుల పాఠశాలలో శనివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 'నారీ శక్తి ఫిట్నెస్ రన్' నిర్వహించారు. 15–29 మధ్య వయస్సు గల యువతులు, మహిళలు 500 మీటర్ల పరుగు పందెంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం సంఘటన్ రాష్ట్ర డైరెక్టర్ ఏఆర్ విజయారావు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పరుగు పందెంలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ఈసయ్య, ఎంపీడీఓ సరిత, పీడీ శేఖర్, పీఈటీ శ్రావణి, హారిక, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఐకేపీ ఏపీఎం కవి త, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, సీసీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పీసీబీ మెంబర్‌గా చింపుల సత్యనారాయణరెడ్డి



చేవెళ్ల: తెలంగాణ పాల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా మండలంలోని దేవుని ఎర్రవల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పాల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్‌గా సీఎస్ శాంతకుమారి వ్యవహరిస్తారని..ఇందులో మెంబర్లుగా రాష్ట్రంలోని పలు రంగాలకు చెందిన వారిని నియమించారని చెప్పారు. ఇందులో భాగంగా తనకు అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కబ్జాలపై నజర్



ప్రభుత్వ భూములు, చెరువులపై ఫోకస్

- ఆక్రమణలను గుర్తించి, తొలగించే పనిలో నిమగ్నం
- ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ వరుస సమీక్షలు
- ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, హద్దురాళ్లు నాటాలని సూచన
- ప్రభుత్వ భూముల్లో సూచిక బోర్డుల ఏర్పాటుకు ఆదేశం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగింది. కబ్జాలపై దృష్టి సారించింది. ఇప్పటికే కుర్మల్‌గూడ సర్వే నంబర్ 46లోని ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలతో పాటు ఖానామెట్ సర్వే నంబర్ 41/14లోని 900 గజాల భూమిలో వెలసిన నిర్మాణాలు, నెక్నంపూర్ పెద్ద చెరువు బఫర్ జోన్‌లో వెలసిన విల్లాలు, బాటసింగారం సర్వే నంబర్ 319 లోని భూదాన్ భూముల్లో వెలసిన పలు నిర్మాణాలను కలెక్టర్ నేలమట్టం చేయించారు. ఒక వైపు ప్రభుత్వ భూములు, బఫర్ జోన్లలో వెలిసిన నిర్మాణాలను కూల్చివేస్తూనే.. మరోవైపు చెరువులను సంరక్షించే చర్యలకు ఉపక్రమించారు. మండలాల వారీగా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ శశాంక రెండు రోజులుగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆ చెరువులకు పూర్వ వైభవం దక్కేనా?

జిల్లాలో మొత్తం 2,132 చెరువులు, కుంటలు ఉండగా, వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. మెజార్టీ చెరువులు ఔటర్‌కు అటుఇటుగా విస్తరించి ఉండటం, ఇక్కడ భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కళ్లు వీటిపై పడ్డాయి.

- మీర్‌పేట్ మున్సిపల్ పరిధి సర్వే నంబర్ 148లోని 59.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మంత్రాల చెరువు ప్రస్తుతం 33 ఎకరాలకు కుంచించుకుపోయింది.
- సర్వే నంబర్ 131లో 35 ఎకరాల విస్తీర్ణంలోని తాళ్లచెరువు కనుమరుగైంది.
- జిల్లెలగూడ సర్వే నంబర్లు 155, 179, 198, 101, 102లోని 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సంజచెరువు 12 ఎకరాలే మిగిలింది.
- సర్వే నంబర్ 61లో 70 ఎకరాల్లో వెలిసిన పెద్ద చెరువులో ఇప్పటికే 42 ఎకరాలకుపైగా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది.
- బాలాపూర్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 184లోని 39 ఎకరాల్లో విస్తరించిన గుర్రంచెరువులో 24 ఎకరాలు ఆక్రమణకు గురైంది.
- సర్వే నంబర్లు 127, 128,/1, 128/2లోని 16.16 ఎకరాల (ఎఫ్‌టీఎల్ పరిధిలో 33.20 ఎకరాలు) పెద్ద చెరువు పరిధిలో 15 ఎకరాలకుపైగా కబ్జా కుగురైంది.
- సర్వే నంబర్లు 188, 189, 190లోని 37.34 ఎకరాల్లో విస్తరించిన బురాన్‌ఖాన్ చెరువు (వెంకటాపూర్) ప్రస్తుతం ఏడు ఎకరాలే మిగిలింది.
- సర్వే నంబర్ 160,169,161లోని 40.9 ఎకరాల్లో విస్తరించిన ఎర్రకుంటలో 32 ఎకరాలు మాయమైంది.
- మల్లాపూర్ రెవెన్యూ వెంకటాపూర్ సర్వే నంబర్ 273లో సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన సుద్దమోనికుంట సగానికిపైగా కబ్జాకు గురైంది.
- బడంగ్‌పేట్‌లోని సర్వే నంబర్ 145లో 14.15 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన కుల్లోనికుంట పది ఎకరాలే మిగిలింది. ఇదే మున్సిపల్ పరిధిలోని కొత్తకుంట ఆనవాళ్లు లేకుండా పోయింది. కనీసం రికార్డులు కూడా లేవు.
- ఇక 267 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన జల్‌పల్లి చెరువులో ఇప్పటికే వంద ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది.
- గొలిదొడ్డి సర్వే నంబర్ 71లోని 5.30 ఎకరాల ఈద్గవానికుంట పూర్తిగా కనుమరుగైంది.
- హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు సరిహద్దు గ్రామంలో 6.23 ఎకరాల్లో విస్తరించిన హత్తిగూడ కుంట ఆనవాళ్లు లేకుండా పోయింది.
- కాటేదాన్‌లోని సర్వే నంబర్ 247లో 19.15 ఎకరాల మామిడికుంట (ఐదు ఎకరాలు) ఆక్రమణకు గురైంది. ఇదే ప్రాంతంలోని అప్పాచెరువు 39 ఎకరాల్లో విస్తరించి ఉండగా 12 ఎకరాలే మిగిలింది.
- బాబుల్‌రెడ్డినగర్‌లోని 22 ఎకరాల నర్సాబాయికుంటను పూర్తిగా మింగేశారు.
- తుర్కయంజాల్ మాసబ్ చెరువు శిఖం భూముల్లో ఇప్పటికే వెంచర్లు వెలిశాయి. ఏకధాటి వర్షాలకు వరదనీరు భారీగా చెరువులోకి చేరడంతో ఆ భూములన్నీ నీటమునిగాయి. రియల్టర్లు ఏకంగా భారీ బండరాళ్లు, లారీల కొద్ది మట్టి పోసి చెరువు ఆనవాళ్లు లేకుడా చేశారు.

కలెక్టర్ సీరియస్

జిల్లాలోని చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రెండు రోజుల క్రితం ఇబ్రహీంపట్నం, కందుకూర్ డివిజన్ ఆర్డీఓ, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సర్వే ల్యాండ్ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయా డివిజన్ల పరిధిలోని చెరువులు కబ్జాలకు గురికాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలని, అక్రమణలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

స్వాధీనం చేసుకునేనా?

జిల్లాలో 2,18,536.02 ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా, మరో 90,911 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. దీనిలో 52,315 మంది పేద రైతులకు అప్పటి ప్రభుత్వం 75,450.29 ఎకరాలు అసైన్డ్ చేసింది. ప్రజావసరాల కోసం మరో 65,935.35 ఎకరాలు కేటాయించింది. ఆక్రణదారుల వద్ద 25,597.01 ఎకరాలు ఉండగా, అసైన్డ్ చేసిన తర్వాత 9,885.13 ఎకరాలు చేతులు మారినట్లు గుర్తించారు. 42,278 అసైన్డ్ ఉల్లంఘన కేసులు సైతం నమోదయ్యాయి. దర్గా లు, మసీదులు, ఆషూర్‌ఖానాలు, చిల్లాలు, శ్మశానవాటికల పేరుతో 14,785.17 ఎకరాల వక్ఫ్ భూ మి ఉండగా, వీటిలో 13,480.25 ఎకరాలు కబ్జా దారుల చేతుల్లోకి వెళ్లింది. మణికొండ దర్గాకు 154 ఎకరాలు ఉన్నట్లు రికార్డులు చూపుతుండగా క్షేత్రస్థాయిలో గజం భూమి కూడా లేదు. మహేశ్వరం మండలం కొంగరకుర్దు ఎ లోని సర్వే నంబర్ 2 నుంచి 400 వరకు ఉన్న దర్గా సయ్యద్ ఖత్తార్ హుస్సేనీ పేరిట ఉన్న 500 ఎకరాలకు పై గా వక్ఫ్ భూముల్లోనూ వెంచర్లు వెలుస్తున్నా యి. జిల్లాలో 21,931.03 ఎకరాలు భూదాన్ భూములు ఉండగా, వీటిలో 9,678 మంది పేదలకు దానం చేశారు. వీటిలో మెజార్టీ భూములు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. మహేశ్వరం మండలం నాగారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు, బాటసింగారం, యాచారం మండలం కుర్మిద్ద, శేరిలింగంపల్లిలోని గోపన్‌పల్లి, వట్టినాగులపల్లి, కందుకూరు మండలాల్లోని విలువైన భూదాన్ భూములు ఇప్పటికే పట్టా భూములుగా మారాయి. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డుల్లో ఈ భూములన్నీ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ..వీటిలో మెజార్టీ భూములు పట్టా భూములుగా మారడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో 1,67,550 సర్వే నంబర్లు ఉండగా, వీటిలో 1,12,858 సర్వే నంబర్లకు మాత్రమే టిప్పన్లు అందుబాటు ఉన్నాయి. మరో 54,692 సర్వే నంబర్లకు టిప్పన్లు లేకపోవడం విశేషం.

'క్రమబద్ధం' ఎప్పుడో..!

- జీఓ నంబర్ 59 కింద వచ్చిన దరఖాస్తులు 29,807
- ఆమోదించినవి 7,911
- తిరస్కరించినవి 21,896
- పట్టాలు జారీ అయినవారు 2,696
- పెండింగ్ అప్లికేషన్లు 5,215
- అర్జీదారులకు తప్పని నిరీక్షణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ ఖాళీ స్థలాలు, వాటిలో వెలిసిన నిర్మాణాల క్రమబద్ధీకరణ అంశంపై సర్కార్ ఇప్పటి వరకు ఓ నిర్ణయం తీసుకోకపోవడంతో అర్హత పొందిన లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇప్పటికే దరఖాస్తు చేసుకుని, క్రమబద్ధీకరణకు అర్హత పొంది, ప్రభుత్వం నిర్ణయించిన రేటు మేరకు నగదు చెల్లించిన వారికి నిరీక్షణ తప్పడం లేదు.

తిరస్కరించినవే ఎక్కువ

గత బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్ 58, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్ 59 తీసుకొచ్చిన విషయం తెలిసిందే. మొదట 2014 జూన్ 2 కటాఫ్ డేట్‌గా ప్రకటించింది. అయితే ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఆ తర్వాత మరోసారి అవకాశం కల్పించింది. 2021 జూన్‌లోనూ దరఖాస్తులు స్వీకరించింది. ఇలా మొత్తంగా జీఓ నంబర్ 59 కింద జిల్లా వ్యాప్తంగా 29,807 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఇప్పటి వరకు 7,911 ఆమోదించగా, 21,896 తిరస్కరించారు.

అర్జీదారుల ఆందోళన

ఆమోదం పొందిన జాబితాలో 2,696 మందికి పట్టాలు కూడా పంపిణీ చేశారు. మరో 5,215 మంది ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు క్రమబద్ధీకరణ చార్జీలు చెల్లించారు. క్రమబద్ధీకరణలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు రావడం, గత ప్రభుత్వంలోని కొంతమంది నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని విలువైన భూములను కొల్లగొట్టిన అంశం బయటపడటంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణ అంశాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఇప్పటి వరకు దీనిపై ఓ నిర్ణయం తీసుకోకపోవడంతో ఇప్పటికే ప్రభుత్వానికి డబ్బులు కట్టిన అర్జీదారులు ఆందోళన చెందుతున్నారు.



జీఓ నంబర్ 59 కింద దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు	ఆమోదించినవి
శేరిలింగంపల్లి	7,830	812
బాలాపూర్	7,006	2,505
అబ్దుల్లాపూర్‌మెట్	4,005	1,247
సరూర్‌నగర్	3,228	1,563
హయత్‌నగర్	2,274	598
రాజేంద్రనగర్	2,142	145
గండిపేట్	1,716	205
మహేశ్వరం	405	265
ఇబ్రహీంపట్నం	331	238
శంషాబాద్	120	04
శంకర్‌పల్లి	199	106
ఆమనగల్లు	114	16
చేవెళ్ల	148	87
మంచాల	41	11
మొయినాబాద్	43	-
తలకొండపల్లి	44	34
యాచారం	41	32
ఫరూఖ్‌నగర్	22	14
చౌదరిగూడ	11	05
కడ్తాల్	06	01
కందుకూరు	20	01
కేశంపేట	10	01
కొందుర్గు	16	10
కొత్తూరు	19	06
మాడ్గుల	03	-
నందిగామ	06	03
షాబాద్	07	02

రౌడీషీటర్ దారుణహత్య

- గొంతుకోసి హతమార్చిన దుండగులు

పహాడీషరీఫ్: ఓ రౌడీషీటర్‌ను గొంతుకోసి దారుణంగా హత్య చేసిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలాపత్తర్‌కు చెందిన రౌడీషీటర్ మహ్మద్ ఉస్మాన్(36) ఏడాది కాలంగా పహాడీషరీఫ్ ఉమర్ కాలనీలోని మీరాష అబూ అల్ కలాం దర్గాలో నివసిస్తూ కూలి పనులు చేసుకుంటున్నాడు. శనివారం మధ్యాహ్నం దర్గాలో పెద్ద ఎత్తున కేకలు వినిపించాయి. దీంతో పక్కనే ఉన్న స్థానికులు లోనికి వెళ్లి చూడగా ఉస్మాన్ గొంతు కోయబడి రక్తపు మడుగులో పడి ఉండడం.. ఇద్దరు దుండగులు అటుగా పారిపోతుండడం గమనించారు. ఆ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి ఉస్మాన్ మృతి చెంది కనిపించాడు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి నిందితుల కోసం గాలించారు. మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత్ రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువా రెడ్డి ఘటనా స్థలిని పరిశీలించారు. ఉస్మాన్‌ను తీవ్రంగా కొట్టి, గొంతు కోసినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. 2009–2011 మధ్య కాలంలో చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇతనిపై బెదిరింపులు, దోపిడీ, దాడి, హత్యాయత్నం లాంటి కేసులు నమోదై ఉన్నాయి. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ఒక బృందాన్ని రంగంలోకి దింపినట్టు ఏసీపీ వెల్లడించారు.



ఉస్మాన్ మృతదేహం



ఆ కార్యాలయంపై ఏసీబీ దృష్టి

కొందుర్గు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దృష్టి పెట్టినట్టు సమాచారం. పహాణీ, ఆర్ఓఆర్ పత్రాల కోసం ఓ ఆర్మీ జవాన్ నుంచి రూ. 40 వేలు తీసుకున్నట్లు సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో వైరల్ కావడం సంచలనం సృష్టించింది. తన భూమికి సంబంధించిన ఆర్ఓఆర్, పహాణీలు ఇవ్వాలని ఆర్మీ జవాన్ అశోక్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. సదరు పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే లక్ష రూపాయాలు ఖర్చవుతాయని, తమకు రూ.40 వేలు ఇస్తే నేరుగా ఇస్తామని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్‌తోపాటు అందెలోనే పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి హేమంత్ డబ్బులు తీసుకున్నారని అశోక్‌రెడ్డి సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పోస్టు చేశారు. ఈ వీడియో ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై శనివారం తహసీల్దార్ రమేష్ కుమార్‌ను వివరణ కోరగా బాధితుడు పోస్టు చేసిన వీడియో ఆధారంగా తాను నివేదిక రాసి ఉన్నతాధికారులకు పంపించినట్టు తెలిపారు.

ఇక 24/7 రోడ్ల మీదే ట్రాఫిక్ పోలీసు!

- ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సమగ్ర ప్రణాళిక
- అదనంగా 2,500 మంది సిబ్బంది నియామకానికి నిర్ణయం
- ఫ్రీ లెఫ్ట్ బ్లాక్‌లు, వాహనాల బ్రేక్ డౌన్‌ల పరిష్కారమే వీరి పని
- సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా వినియోగించేలా అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసికి నిత్యం నరక ప్రాయంగా మారిన ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. గంటల తరబడి రోడ్లపై చిక్కుకుపోయి తిప్పలు పడుతున్న వాహనచోదకులకు ఊరట కలిగించేందుకు, పనిలో పనిగా వాయు, శబ్ద కాలుష్యానికి చెక్ పెట్టేందుకు పోలీసు శాఖ సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తోంది. అదనపు సిబ్బందితోనే వాహనాల రద్దీని అదుపు చేయడం సాధ్యమవుతుందని గుర్తించింది. ఈ మేరకు అదనపు ట్రాఫిక్ సిబ్బందిని సమకూర్చుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు కలిపి అదనంగా 2,500 మంది ట్రాఫిక్ సిబ్బంది అవసరమని గుర్తించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 24/7 రోడ్ల మీదనే ఉంటూ వాహనాలు, ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించడమే ఈ అదనపు సిబ్బంది పని.

- ఇటీవల పోలీసుఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు 1,000, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లకు 1,500 మంది అదనపు ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.



ట్రాఫిక్ రద్దీ ఇలా..

ప్రధానంగా రహదారులపై ఫ్రీ లెఫ్ట్ బ్లాక్‌లు, వాహనాల బ్రేక్ డౌన్‌లే ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణాలని పోలీసులు గుర్తించారు. దీంతో ఆయా అంశాలపై తక్షణమే స్పందించేందుకు ఈ అదనపు ట్రాఫిక్ పోలీసులను రోజంతా రోడ్లపైనే ఉంచాలని నిర్ణయించారు. ఈ సిబ్బంది ప్రత్యేక ప్రణాళికలతో వర్షాకాలంలో రోడ్లపై ఎదురయ్యే సమస్యలను కూడా పరిష్కరించనున్నారు. ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా ఇప్పటికే రాంగ్ సైడ్ డ్రైవింగ్‌లపై గ్రేటర్ ట్రాఫిక్ విభాగం కఠినంగా వ్యవహరించడం ప్రారంభించింది. ద్వి, మూడు చక్రాల వాహనాలకు రూ.200, నాలుగు, అంతకంటే ఎక్కువ చక్రాల వాహనాలకు రూ.700 చొప్పున జరిమానాలు విధిస్తోంది. అలాగే ట్రావెల్ బస్సులు, భారీ వాహనాలు నగర రోడ్లపై నిర్దేశిత సమయాల్లోనే వచ్చేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. దీంతో రోడ్లపై వాహనాల కదలికలు సాఫీగా, వేగంగా జరుగుతాయని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

వ్యక్తిగత కార్ల వినియోగాన్ని తగ్గించేలా..

వాహనదారులు, కాలనీవాసుల సూచనల మేరకు అవసరమైన చోట యూ టర్న్‌లు, కూడళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇవి స్వల్ప కాలిక పరిష్కారం మాత్రమేనని, రోజూ నగర రోడ్లపైకి వస్తున్న వందలాది వాహనాలను తగ్గిస్తేనే శాశ్వత పరిష్కారం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో వ్యక్తిగత కార్ల వినియోగాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు ప్రజారవాణా వ్యవస్థను వినియోగించేలా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఎక్కువమంది ప్రజలు మెట్రో, బస్సుల్లో ప్రయాణిస్తే రోడ్లపై వాహనాల రద్దీ తగ్గడంతోపాటు వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని వివరించనున్నారు.

సాక్షర భారత్ కో ఆర్డినేటర్లను ఆదుకోండి



వేంనరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కందుకూరు: సాక్షర భారత్‌లో మండల, గ్రామ కోఆర్డినేటర్లుగా సేవలందించిన వారిని అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.సురేష్‌కుమార్, జిల్లా నాయకుడు బర్కం వెంకటేశ్ మాట్లాడుతూ..2010 నుంచి 2019 సంవత్సరం వరకు గ్రామ, మండల స్థాయిలో సాక్షర భాతర్ పథకం కింద సమర్థవంతంగా విధులు నిర్వర్తించామని,ప్రభుత్వం తమను ప రిగణలోకి తీసుకుని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నయీంఖాన్, కె.భీమయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో అఘాయిత్యం

- గర్భందాల్చిన బాలిక
- నిందితుడికి రిమాండ్

మీర్‌పేట: ప్రేమపేరుతో ఓ యువకుడు.. బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గడియగౌరారం గ్రామానికి చెందిన శేఖర్ (28)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను డీజే ఆపరేటర్‌గా పనిచేస్తూ.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక (17)కు ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి.. పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఆతర్వాత శేఖర్‌కు వివాహమై, ఇద్దరు పిల్లలున్న విషయాన్ని తెలుసుకుని అతడిని నిలదీయగా.. బాలికతో బలవంతంగా గర్భనిరోధక మాత్రలు మింగించాడు. తీవ్ర రక్తస్రావమై అస్వస్థతకు గురైన బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారి ఫిర్యాదు మేరకు ఈ నెల 7న మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో శేఖర్‌పై కేసు నమోదు చేసి, శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు.


నిందితుడు శేఖర్

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

మొయినాబాద్: ఇద్దరు వ్యక్తులు గొడవపడి కర్రతో తలపై కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మొయినాబాద్ మండలంలోని ఎనికేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎస్ రాజుసింగ్(32), మణికొండలో డాక్టర్ శ్రీనివాసులు వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 5న రాత్రి ఇంట్లో పనిచేసే హనుమంతు, అభిషేక్‌లతో కలిసి డాక్టర్ ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను వాహనంలో మొయినాబాద్‌లోని ఎనికేపల్లి శివారుల్లో ఉన్న ఫాంహౌస్‌కు తీసుకొచ్చారు. సామాన్లు దింపిన అనంతరం రాజుసింగ్, అభిషేక్ బయటకు వెళ్లి మద్యం సేవించి గొడవపడ్డారు. రాజుసింగ్ వంట చేస్తుండగా అభిషేక్ చెక్క కర్ర తీసుకొని తలపై కొట్టాడు. దీంతో తీవ్రగాయాలయిన రాజుసింగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎస్‌ఓటీ పోలీసుల సహాయంతో నిందితుడు అభిషేక్‌కుమార్ గోండ్ అలియాస్ రాహుల్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.


నిందితుడు అభిషేక్‌కుమార్(ఫైల్)

మానవత్వం చాటిన నాయకులు

మతిస్థిమితం లేని యువకుడికి సపర్యలు

కడ్తాల్: గత రెండు నెలలుగా మండల కేంద్రంలో ఓ మతిస్థిమితం లేని యువకుడు శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిపై తిరుగుతూ రోడ్డు పక్కన నివాస గృహాల వారు పెట్టే భోజనం తింటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఎవరైనా పలకరిస్తే ఒకటి రెండు మాటలు హిందీలో మాట్లాడుతూ.. ఎక్కడి నుంచి వచ్చావు, నీ పేరేంటి, మీ తల్లిదండ్రులు ఎవరూ అంటే, మేరానామ్ మోహిత్, కల్యాణ్‌పూర్ అంటూ అమాయకంగా చూస్తుండి పోతున్నాడు. యువకుడి దీనస్థితిని చూసి చలించిపోయిన కడ్తాల్ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్‌లు శనివారం ఆ యువకుడికి అండగా నిలిచారు. అతడికి క్షవరం చేయించి, స్నానం చేయించి కొత్త బట్టలు తొడిగి కడుపు నిండా భోజనం పెట్టించారు. అనంతరం స్థానిక ఎస్‌ఐ వరప్రసాద్‌ను కలిసి యువకుడి పరిస్థితిని వివరించారు. దీంతో ఎస్‌ఐ యువకుడి వివ రాలు బీహార్‌లోని కల్యాణ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి, వాట్సాప్ ద్వారా ఫొటోలు పంపించాడు. అనంతరం సీఐ శివప్రసాద్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ఆనాథశ్రమానికి యువకుడిని తరలించారు. దీంతో స్థానికులు నాయకులను అభినందించారు.


మోహిత్‌తో నాయకులు ,ఎస్‌ఐ వరప్రసాద్

భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య

పహాడీషరీఫ్: భార్య తో గొడవపడి వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జ్యోతి, సూరజ్‌లాల్(21) పది రోజుల క్రితం తుక్కుగూడకు వలస వచ్చి నర్సరీలో పని చేస్తున్నారు. రెండు రోజుల నుంచి సూరజ్‌లాల్ మద్యం సేవించి రావడాన్ని గమనించిన జ్యోతి శుక్రవారం రాత్రి ఎందుకు తాగొచ్చావంటూ నిలదీసింది. దీంతో సూరజ్‌లాల్ ఆమెను కొట్టడంతో పాటు గదిలో నుంచి బయటకు గెంటి లోపల నుంచి డోరు పెట్టుకున్నాడు. ప క్కనే ఉండే జ్యోతి సోదరి వచ్చి, గొడవ విష యం రేపు మాట్లాడుదామంటూ తన ఇంటికి తీసుకెళ్లింది. శనివారం ఉదయం జ్యోతి ఇంటికి వచ్చి తలుపు తట్టగా సూరజ్ డోర్ తెరవలేదు. కిటికిలో నుంచి చూడగా ఉరేసు కొని కనిపించా డు. తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడ గా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


సూరజ్‌లాల్ మృతదేహం

కనుల పండువగా కాశీవిశ్వనాథుడి కల్యాణం

కడ్తాల్: మండలం పరిధిలోని మైసిగండి గ్రామంలోని కొలువైయున్న కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఆలయంలో ఏకదశ కలశాభిషేకం, వసంతోత్సవం, అవబృతం, పూర్ణాహుతి నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవకాలంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవం భక్తజన సందోహం మధ్య వైభవంగా చేశారు. అనంతరం శనివారం తెల్లవారు జామున రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్ జ్యోతి ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


మైసిగండిలో శివపార్వతుల కల్యాణోత్సవం

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మొయినాబాద్: అదృశ్యమైన వ్యక్తి గండిపేట చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన కాడిగళ్ల నరేష్(30)గత కొంత కాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. దీంతో మూడేళ్ల నుంచి భార్య దూరంగా ఉంటుంది. గత పది రోజుల నుంచి నరేష్ ఊళ్లో కనిపించకుండా పోయాడు. శనివారం మధ్యాహ్నం చిలుకూరు సమీపంలో ఉన్న గండిపేట చెరువులో నరేష్ మృతదేహం కుళ్లిన దశలో కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వెలికి తీశారు. నరేష్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


మృతుడు నరేష్ (ఫైల్)

మృతుడిపై కేసు నమోదు..

మృతుడు నరేష్‌పై పది రోజుల క్రితం మొయి నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. నరేష్ తన వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని, చేయి పట్టి లాగాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచే పరారీలో ఉన్న నరేష్ చెరువులో శవమై తేలడంపై అనుమానాలకు తావిస్తుంది.

యువతి అదృశ్యం

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన ఘటన శనివారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ నూరీనగర్‌కు చెందిన సయ్యద్ అహ్మద్, ఫరీదా దంపతుల కుమార్తె నాజీయా ఫాతిమా(19), అప్పుడప్పుడు ఆమె షాహీన్‌నగర్‌లో ఉంటే పెద్దమ్మ షాహీన్ ఉన్నీసా ఇంటికి వెళ్లి వస్తూ ఉండేది. ఈ క్రమంలో పెద్దమ్మ ఇంటి ఎదురుగా ఉ న్న సోహేల్‌తో మాట్లాడుతుందన్న విషయం తెలుసుకున్న ఫరీదా పలుమార్లు మందలించింది. ఈ నెల 8న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న తల్లి స్థానికంగా వెతికినా ఫలితం లేకపోవడంతో, సోహేల్‌పైనే అనుమానం ఉందంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


నాజియా (ఫైల్)